


ఆయన్ని ఇదివరకు ఎక్కడా చూసిన గుర్తులేదు. అడిగాడు కాబట్టి నా పేరు చెప్పాను.

వెంటనే నా టేబిల్ ఎదురుగా వున్న ఖాళీకుర్చీలో కూర్చుని, చేతులోని జిప్ వూడిపోయిన ఓ పాతప్లాస్టిక్ హేండ్‌బేగ్‌ని బల్లమీద వుంచాడాయన.

ఓసారి భుజంమీది ఉత్తరీయంతో ముఖానవున్న స్వేదబిందువులని తుడుచుకొని చెప్పాడు.

"ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉన్నాయి."

ప్యూన్‌ని పిలిచి మంచినీళ్ళు తీసుకురమ్మని చెప్పాను.

"నా పేరు సంగమేశ్వరరావు" చెప్పాడాయన.

"నేనేలా తెలుసు మీకు" అడిగాను కొద్దిగా ఆసక్తిగా.

ఒకాయన మీగురించి చెప్పారు...."ప్యూన్ ఇచ్చిన చల్లటి నీళ్ళని తాగి అడిగాడు.

"కూలర్ ఉందా మీ ఆఫీసులో?"

ఉందన్నట్లుగా తల వూపాను.

ప్యూన్ ఖాళీగ్లాస్‌తో వెళ్ళిపోయాక చెప్పాడు ఆయన.

"మీగురించి చెప్పారు ఒకరు. నేను తెనాలిలో బడిపంతులుగాచేసి రిటయిరయి రెండేళ్ళు అవుతోంది. ఇక్కడే మా పెద్దబ్బాయి డిఫెన్స్ ఎకౌంట్స్‌లో పనిచేస్తున్నాడు. తెనాలిలో నాకేం, ఆస్తిపాస్తులు లేవుకాబట్టి వచ్చి మా అబ్బాయి దగ్గరే ఉంటున్నాను."

నాకు చూచాయగా బోధపడింది ఆయన ఎందుకు నన్ను చూడడానికి వచ్చాడో.

"అశోక్‌నగర్‌లో ఎవరు చెప్పారు మీకు నా గురించి?" అడిగాను.

"అమరేశ్వరరావుగారని.... ఆయన గురించి నాకు ఈ మధ్యే తెలిసింది"

"చెప్పండి" అన్నాను.

"మీరు పెళ్ళిచేసుకొనే ఉద్దేశంలో వున్నారని తెలిసింది. అమరేశ్వర రావుగారు నాకు వివరాలన్నీ చెప్పారు. ఎడ్రస్ తీసుకొని ఇలా వచ్చాను."

నేను మౌనంగా ఉండిపోయాను.

"మా పెద్దమ్మాయికి ఇంకా పెళ్ళి కాలేదు. సంబంధాలు ఏమయిన చెప్తారని అమరేశ్వరరావుగారి దగ్గరికి వెళితే మీ గురించి చెప్పారు."

ఆయనవంక ఈ సారి పరీక్షగా చూసాను. దాదాపు అరవై దాకా ఉంటుంది ఆయన వయసు. జుట్టురాలిపోలేదు. కాని పూర్తిగా నెరసి పోయింది ముగ్గుబుట్టలా. ఖద్దరులాల్చీ శుభ్రంగా ఉతికినట్లుగావుంది. కాని అక్కడక్కడా చిరుగులు. ఛాతీకి ఎడం చేతివైపు ఆ లాల్చీకి పెన్ను పెట్టుకునేందుకు అదే పరిమాణంలో కుట్టివున్న సన్నటి జేబులో పెన్ను ఒకటి ఉంది.

ఆయన మొహం ప్రశాంతంగావుంది. నల్ల ఫ్రేముగల కళ్ళజోడు నుదుట ఎర్రటి కుంకంబొట్టు పెసర గింజంత వుంది. ఆరోజే గడ్డం, గీసు కున్న గుర్తుగా నున్నగా వున్నాయి గడ్డం, చెంపలు.

"కాఫీ తీసుకుంటారా?" అడిగాను ఫ్యాన్‌కోసం అటూ ఇటూ చూస్తూ.

కొన్ని క్షణాలు తటపటాయించి అన్నాడాయన నెమ్మదిగా.

"మీతో నాలుగయిదు ముక్కలు మాట్లాడాలి. ఇక్కడ బావుండదు. ఓసారి బయటికివస్తే మళ్ళీ అయిదు నిముషాలలో వచ్చేద్దురుగాని. లేదా మీ లంచ్ టైం అయేదాకా ఆగమంటే ఆగుతాను."

"వస్తానయితే ఒక్క క్షణం." అని నేను చూస్తున్న ఫైల్‌ని మళ్ళీ తెరచి త్వరత్వరగా ఆ ఫైల్‌పని పూర్తిచేసి ప్యూన్‌ని పిలచి దాన్ని ఆఫీసర్ గదిలోకి తీసుకెళ్ళమని చెప్పాను.

లేచి నిలబడి చెప్పాను ఆయనతో.

"రండి"

ప్రక్క సీటులోని నా కొలీగ్‌తో చెప్పాను.

"ఆఫీసర్ పిలుస్తే ఎవరో వచ్చారని, పదినిముషాల్లో వస్తానని చెప్పు.

అతను తల వూపాడు.

థర్డ్‌ఫ్లోర్‌లోంచి లిఫ్ట్‌లో కిందకి వచ్చాము. వెయ్యిగజాలదూరంలో వున్న హోటల్‌వైపు నడిచాను. ఆయన చేతిలో బేగ్‌తో నన్ను అనుసరించాడు.

అమరేశ్వరరావు నాలాగే కేంద్రప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు హైద్రాబాద్‌లో. ఆయన ఇంట్లో పెళ్ళికొడుకులు, పెళ్ళికూతుళ్ళ తాలూకు వివరాలుండే రిజిష్టర్ ఒకటి వుండుంది. వయస్సు, వుద్యోగం, కులం, శాఖ, జీతంలాంటి అనేక వివరాలు ఆ రిజిష్టర్లో ఉంటాయి. సంబంధాలకోసం వెదికే వాళ్ళపాలిట ఆయన పెన్నిధి. ఆయన దగ్గరికి వెళితే ఎవరికి సరిపడ్డ వాళ్ళ వివరాలు వాళ్ళకు చెప్తాడు. ఆ రిజిష్టర్ చూసి హైద్రాబాద్‌లో ఆయన గురించి చాలామందికి తెలుసు. అందుకని ఆయన దగ్గిరకి వెళ్ళేవాళ్ళ సంఖ్య అధికం. అయితే ఆదివారాలు మాత్రమే ఇంటిదగ్గర ఆపని చేస్తారాయన.

కేవలం ప్రజలకి సహాయం చేసే ఉద్దేశంతో తప్ప, ధనాన్ని ఆర్జిద్దామనే ఆశతో కాదు ఆయన ఈపనిచేసేది. ఒక విధంగా ఇదో హాబీ ఆయనకి. స్టాంప్స్, నాణాలు కలెక్టు చేయటం, కలం స్నేహం చేయడంలాంటివి ఎలా హాబీలో మేరేజ్ మేకర్‌గా పనిచేయడం ఆయన హాబీ.

నా చెల్లెలికి వరుడు కావాలని ఆయన దగ్గరకి వెళ్ళాను ఓసారి. ఆ సందర్భంలో ఆయన రిజిష్టర్‌లో ఎక్కింది నాపేరు.

హోటల్ అట్టే రద్దీగా లేదు, ఫేన్‌కింద ఓమూల కూర్చున్నాము నేను, సంగమేశ్వరరావు.

బేరర్ రాగానే అడిగాను ఆయన్ని.

"టిఫిన్ తీసుకుంటారా?"

"రెండుప్లేట్ ఇడ్లీ" ఆయనే చెప్పాడు బేరర్‌కి.

"మీరు యు. డి. సి కదా?" అడిగాడు.

"అవును" చెప్పాను.

"ఎప్పుడు చేరారు సర్వీసులో!"

"1972 సెప్టెంబర్‌లో"

"జీతం ఎంత వస్తుంది "

"ఆరువందలదాకా వస్తుంది చేతికి"

"అదే చెప్పారు అమరేశ్వరరావుగారు.... పోతే మా అమ్మాయి గురించి ఉన్నదున్నట్లుగా చెప్పేస్తున్నాను. పెద్ద రంభేంకాదు. అలాఅని అనాకారీ కాదు. సామాన్యంగా, సంసార పక్షంగా ఉంటుంది. ఇరవై మూడు వస్తుంది వచ్చేనెల. ఎసెసెల్సీదాకా చదివించాను అంతే. పాటలుపాడుతుంది. ఇంటిపనంతా అదే చేస్తుంది. మా అబ్బాయికి ఇంకా వివాహం కాలేదు. నిజానికి రేపు దానికి పెళ్ళయి బయటకి వెళ్ళితే తిండికి ఇబ్బంది పడాలి మేం. నా భార్యపోయి పదేళ్ళు అవుతోంది. రెండో అమ్మాయికి పదిహేనేళ్ళు వంటా అదీ సరిగ రాదు.

బేరర్ ఇడ్లీప్లేట్లు తెచ్చి టేబుల్‌మీద పెట్టి వెళ్ళాడు.

"ఇవాళ ఏకాదశి, మంచిరోజు. సాయంత్రం ఓసారి వచ్చి మీరు అమ్మాయిని చూస్తే బావుంటుందని, ఆహ్వానించడానికి వచ్చాను.

నేనేం జవాబు చెప్పలేదు వెంటనే. కొద్దిసేపు ఆగి చెప్పాడు.

"అట్టే కట్నం కానుకలు అవీ ఇచ్చుకోలేను నేను. ఉన్నంతలో నా శక్తి మేర చేస్తాను. నాలుగువేలదాకా ఇవ్వగలను. నేనూ పెద్దవాడి నయి

పోయాను. నేపోయేలోగా ఇద్దరి జీవితాలు సెటిల్ అయితే తృప్తిగా పోవచ్చనే ఉద్దేశంలో ఉన్నాను."

"మా పెద్దవాళ్ళని సంప్రదించకుండా నా అంతట నేనే వచ్చి మీ అమ్మాయిని చూడటం బావుండదేమో!" సందేహంగా అన్నాను.

"దానికేముంది? చూడటంలో తప్పులేదు కదా? మీ మనసుకు పర్వాలేదనిపిస్తే తర్వాత వాళ్ళతో మాట్లాడవచ్చు. మీకే నచ్చకపోతే ఇక వాళ్ళ ప్రసక్తే ఉండదు" "ఇవాళ సాయంత్రం కొద్దిగా పని ఉంది నాకు.

"ఎప్పుడు వస్తారయితే."

రేపులేదు ఎల్లుండి త్రయోదశి. ఎల్లుండి సాయంత్రం వస్తారా పోనీ?"

ఆయన కంఠంలోని అభ్యర్థనని తోసిపారేయ్య లేకపోయాను.

"వస్తాను" అన్నాను.

"అమరేశ్వరరావుగారి దగ్గర మీ జన్మ నక్షత్రం తాలూకు వివరాలున్నాయి. ఇద్దరి నక్షత్రాలు మేచ్ అయాయి. ఎల్లుండి ఎప్పుడొస్తారు."

"సాయంత్రం ఆఫీస్‌నుంచి వస్తాను."

"సికింద్రాబాద్ స్టేషన్‌నుంచి బస్సులుంటాయి. తిరుమల్‌గిరి బజార్ బస్‌స్టాప్‌లో దిగండి బస్. ఆరున్నర ఏడుమధ్య నే నక్కడే ఉంటాను."

"అలాగే"

బేరర్‌కి రెండు కాఫీ తనే ఆర్డర్ చేసాడు సంగమేశ్వరరావు.

కాఫీ తాగి చెప్పాడు.

"తప్పకరావాలి మీరు."

"వస్తాను."

"ఏదో ఆ భగవదనుగ్రహంవల్ల మీ మనసుకు తృప్తి అనిపిస్తే ఆ తర్వాత ఏం చేయాలో మాట్లాడుకుందాం."

బిల్లు తనే అందుకోబోయాడు.

"ఫర్వాలేదు. నే ఇస్తాను" అన్నాను.

మొహమాట పడుతూనే నాకిచ్చాడు. బయటకి వచ్చాక శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

త్రయోదశినాడు సాయంత్రం ఆఫీస్‌నుంచి వెళ్ళాను సరాసరి తిరుమల్‌గిరి బజారు. బస్సు దిగాను. ఆయన రాలేదు. ఏడుంపావుదాకా సంగమేశ్వరరావుకోసం ఎదురు చూసాను.

ఆయన రానేలేదు.

విసుగేసి సిటీబస్ ఎక్కి గదికి చేరుకున్నాను.

మర్నాడు ఉదయం ఆఫీస్‌కివచ్చి, తను బస్‌స్టాప్‌కి రాలేకపోయినందుకు ఏర్పడ్డ బలమయిన కారణం చెప్పి, అపాలజీస్ చెప్పి, ఇంకోరోజు సూచిస్తాడనుకున్నాను.

ఆఫీస్‌కి రాలేదు సంగమేశ్వరరావు.

మర్నాడేకాదు.

ఆయన మళ్ళీ ఎప్పుడూ రాలేదు నా దగ్గరికి.

ఆయన నా దగ్గరకి మళ్ళీరాక పోవడానికి కారణం బోధపడలేదు నాకు ఎంత ఆలోచించిన. ఆ అమ్మాయికి ఇదివరలో చూసిన సంబంధం ఏదయినా కుదిరి ఉండి ఉండాలనుకున్నాను. లేదా నేను నచ్చి ఉండను.

తర్వాత ఆయనగురించి మర్చిపోయాను.

* * *

నేను పనిచేసే ఆఫీస్‌లో దాదాపు రెండువేల అయిదువందలమంది దాకా వచ్చి పనిచేస్తున్నారు. చాలా పెద్ద ఆఫీసు అది.

సంగమేశ్వరరావు నా దగ్గరకి వచ్చి వెళ్ళిన నెల తర్వాతనుకుంటాను. ఓ రోజు పనివుండి ఓ స్నేహితుడికోసం ఇంకో సెక్షన్‌లోకి వెళ్ళాను.

సంగమేశ్వరరావు నాకు కనబడ్డాడు. నా స్నేహితుడి ముందు కూర్చుని మాట్లాడుతున్నాడు. నా స్నేహితుడుకూడా పెళ్ళికి సిద్ధంగా ఉన్నాడు కొబట్టి ఆయన రాకకి అర్థం స్ఫురించింది నాకు.

ఆపరిస్థితిలోవాళ్ళదగ్గరకి వెళ్ళటం ఇష్టంలేకవెనక్కి తిరిగివచ్చేసాను.

మర్నాడు ఉదయం వెళ్ళాను నా మిత్రుడి దగ్గరకి.

"ఏమిటి విశేషాలు? అడిగాను.

"సంగమేశ్వరరావుగారు కదానిన్న నీదగ్గరకు వచ్చింది?" అడిగాను.

"అవును నీకు తెలుసా ఆయన?" అడిగాడు.

తెలుసు వాళ్ళమ్మాయిని చూడడానికి ఆహ్వానించడానికి వచ్చాడా!

"అవును. నీకెలా తెలుసు ఆ విషయం?"

"ఎప్పుడు వెళ్తున్నావు?"

నిన్న సాయంత్రమే వెళ్ళాను."

"బావుందా!"

"బస్‌స్టాప్ దగ్గర ఉంటాను. రండి అని పిలిస్తే వెళ్ళాను. తీరావెళితే ఆయన బస్‌స్టాప్‌కి రానేలేదు. వాళ్ళింటి అడ్రస్ తెలియదు."

"చూడకుండానే తిరిగి వచ్చేసావన్నమాట?" నవ్వుతూ అడిగాను.

"అదేం పెద్దమనిషి? రెండుగంటలు వేస్టు. అలాంటప్పుడు పిలవడం దేనికో అతను" చిరాకుగా అన్నాడు.

"నాకూ జరిగింది ఈ అనుభవం."

"నీకూనా? అంటే నిన్నూ కలిసాడా?"

తలవూపి జరిగి చెప్పాను.

"తిరుమల్‌గిరి బజారా? నాతో సనత్‌నగర్ అని చెప్పాడే!" ఆలో చనగా అన్నాడు."

"ఇల్లు మారాడేమో?"

"అయివుండచ్చు. ఇవాళ వస్తాడని ఎదురుచూస్తున్నాను."

"నీవు నచ్చివుండవు ఆయనకి" నవ్వాను.

"మర్యాదలేని మనిషి" అన్నాడు నా మిత్రుడుకూడా నవ్వి.

ఓ రోజు మిత్రుడు నా సెక్షన్‌కి వచ్చి చెప్పాడు.

"విచిత్రంగా ఉంది ఈ సంగమేశ్వరరావు సంగతి."

"ఏం?" అడిగాను.

"నా స్నేహితుడొకడు స్టేట్‌బేంక్ ఆఫ్ హైద్రాబాద్‌లో పనిచేస్తు న్నాడు. అతని దగ్గరకి వెళ్ళాడట నాలుగురోజుల క్రితం మనకి అయినట్లు గానే అయిందట అతనికికూడా."

"బస్‌స్టాప్‌కి రాలేదా?"

"రాలేదట."

ఈసారి నిజంగా ఆశ్చర్యం వేసింది నాకు.

"ఈసారి కనబడితే అసలెందుకిలా మనల్ని ఇన్‌సల్ట్ చేస్తున్నాడో అడగాలి" అన్నాడు నా మిత్రుడు కోపంగా.

ం ం ం

"ఎందుకు?" అడిగాను.

"ముందర నీ నెవరో తెలియదని, నన్నెప్పుడు చూడలేదని దబాయించినా తర్వాత సంగమేశ్వరరావు వప్పుకున్నాడు. నన్ను నా ఆఫీసులో కలిసినట్లు, వాళ్ళమ్మాయిని చూడటానికి ఆహ్వానించినట్టు.

నన్నేకాదు. బస్‌స్టాప్‌కి రాకుండా నా స్నేహితులని ఇద్దరినికూడా మీరీమోసం చేసారు. అసలెక్కడా మీరుండేది?

ఒక్కళ్ళతో సనత్‌నగర్ అని చెప్పారు ఇంకొకరితో విజయనగర్ కాలనీ అని చెప్పారు. నాతో తిరుమల్‌గిరి బజారు అని చెప్పారు." కొద్దిగా కోపంగా అడిగాను.

"నేనెక్కడుంటే మీకెందుకులెండి" నసిగాడు.

"ఇదేం సరదా మీకు."

"సరదాకాదు బాబూ తప్పనిసరయి చేస్తున్నాను." ఆయన కంఠంలో విచారం చోటు చేసుకుంది.

"అంటే ?"

నెమ్మదిగా చెప్పాడు.

"మీరు వుద్యోగం చేసుకుని హాయిగా బ్రతుకుతున్నారు కాబట్టి మీకు ఆకలి బాధ తెలియదు. నేను రిటేరయ్యాక నాకు తెలుస్తోంది. ఆ బాధ ఎంత ప్రయత్నించినా వుద్యోగం దొరకలేదు మళ్ళీ-ఆస్తి కూడా లేదు. హైద్రాబాద్ వచ్చాను. నా కొడుకుకీ, నాకు సరిపడదు. విడిగా ఉంటున్నాను. కొంతకాలం

కోటీ సెంటర్‌లో నిలబడి బిచ్చం అడిగాను. అయిదుపైసలో పదిపైసలో ఇమ్మని. అయినా కడుపు నిండేదికాదు. చివరికి ఈరకం బిచ్చంలోకి దిగాను.

"అర్థమయ్యేలా చెప్పండి" అడిగాను నాలోని కోపం మటుమాయ మయింది.

"కొత్తలో ఆఫీసులకి వెళ్ళి ఎవర్నయినా టిఫిన్ పెట్టించమని అడిగితే కసిరి కొట్టేవాళ్ళు. కాని పిల్లనిచ్చే తండ్రిగా వెళితే అలా చేయరని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను.

ఆయన బయటకి వెళ్ళి మాట్లాడుకుందాం అన్నప్పుడు మేం హోటల్‌కి వెళ్ళి మాట్లాడుకున్న సంఘటన గుర్తుకొచ్చింది నాకు.

"నాతోపాటు పిలవగానే బయటకి వస్తారు. హోటల్‌లో టిఫిన్ తింటాను. వాళ్ళింటి దగ్గరగా ఉండే ఓ బస్‌స్టాప్ దగ్గర ఉంటానని అబద్ధం ఆడి, కడుపునింపుకుని వెళ్తాను. తర్వాత వాళ్ళ సంగతి మర్చిపోతాను. గత నాలుగు నెలలుగా ఈ కొత్తరకం బిచ్చం ఎత్తి బ్రతుకుతున్నాను."

నేనేం మాట్లాడలేకపోయాను.

"ఐ యామ్ సో సారీ! కాని బ్రతకాలిగా!"

నవ్వినా ఆ నవ్వులో విచారం తొంగిచూసింది. జేబులోంచి పర్స్‌తీసి రెండురూపాయలు అందిచ్చాను ఆయనకి వద్దనకుండా తీసుకున్నారు. ఓసారి దానివంక చూసి అడిగాడు.

"ఇంకో రెండుందా?"

"లేదు" చెప్పాను.

ఆ నోటుని జేబులో ఉంచుకుని నవ్వి అన్నాడు.

"ఇకనుంచి మా అమ్మాయిని చూడటానికి రమ్మనిపిల్చి, ఆ మర్నాడు మళ్ళీ ఆఫీసుకి వెళ్ళి ఆ కుర్రాడితో రాలేకపోయాననీ, అమ్మాయి బయ

టుందనో ఏదో కారణం చెప్తూంటాను. ఇలా మళ్ళీ ఎవరు నిగ్గతీసి అడగరు నడిరోడ్డుమీద. ఇదో కొత్తరకం బిచ్చం కదూ?"

నేను నవ్వాను.

"ఇంతకు మీకు నిజంగా పెళ్ళి చేయాల్సిన అమ్మాయి వుందా?" అడిగాను.

జవాబు చెప్పలేదు సంగమేశ్వరరావు. నవ్వి గబగబా జనంలో కలిసి పోయాడు.

(స్వాతి వారపత్రిక, జూన్ 1979)